సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 14 । నవంబర్ । 2024

మలిపొద్దులో వలిసె సొగసు



సూర్యాస్తమయం వేళ వలిసె పూల అందాలు కనువిందు చేశాయి. భానుడి కిరణాలు తాకడంతో కొత్త అందాలు ఆవిష్కృతమయ్యాయి. అరకు నుంచి జైపూర్ వెళ్లే రోడ్డులోని చటువా ప్రాంతంలో ఆ అద్భుత దృశ్యం ప్రకృతి ప్రేమికులను కట్టిపడేసింది. – సాక్షి, పాడేరు

న్యూస్‌రీల్

సాక్షి మీడియా ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ డే వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరు కానున్న కలెక్టర్ దినేష్ కుమార్
- పాడేరు బాలసదనంలో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి



సాక్షి,పాడేరు: సాక్షి మీడియా ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా జరగనుంది. గురువారం చిల్డ్రన్స్ డే సందర్భంగా జిల్లా కేంద్రం పాడేరులోని తలారిసింగి జంక్షన్ వద్ద ప్రభుత్వ బాలసదనంలో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముఖ్య అతిథిగా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ హాజరు కానున్నారు. సాయంత్రం 4గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో బాలికలతో కలిసి ఆయన కేక్ కట్ చేస్తారు. అనంతరం నిర్వహించే ఆటల పోటీలను ఆయన ప్రారంభిస్తారు. విజేతలకు బహుమతులు అందజేస్తారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యంతో అధికారులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో వ్యాపారి వెంకటరమణ ఇంట్లో నిల్వ ఉంచి 440 కిలోల పీడీఎస్ బియ్యాన్ని బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. అందిన సమాచారం మేరకు పోలీసుల సహకారంతో తనిఖీ చేశామన్నారు. అక్రమంగా నిల్వచేసిన బియ్యాన్ని సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు. వ్యాపారిపై 6ఎ కేసు నమోదు చేసినట్టు ఆయన వెల్లడించారు. ఆర్‌ఐ చెల్లమ్మ, వీఆర్వో సూర్యాకాతం పాల్గొన్నారు.



సన్యాసమ్మపాలెం ప్రాంతంలో మడుల్లో ఉన్న వరి పనలు

వరుణ గండం

- వాతావరణంలో మార్పుతో గుబులు
- అక్కడక్కడ వర్షాలతో ఆందోళన
- పొలాల్లోనే వరి పనలు
- సురక్షిత ప్రాంతాలకు తరలింపునకు హైరానా
- వ్యయ ప్రయాసలకు గురవుతున్న గిరి రైతులు

వంట చేతికందే సమయంలో ఏటా వరి రైతులకు హైరానా తప్పడం లేదు. వాతావరణంలో మార్పులు వారిని ఆందోళనకు గురి చేస్తున్నాయి. వ్యయ ప్రయాసలకు కారణమవుతున్నాయి



పొలాల్లోంచి వరిపనలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న కూలీలు



డి.గొందూరులో యంత్రంతో ధాన్యాన్ని నూర్పిడి చేస్తున్న గిరి రైతులు

సాక్షి,పాడేరు : వరి పంట చేతికందే సమయంలో వాతావరణ పరిస్థితులు గిరి రైతుల్లో గుబులు రేపుతున్నాయి. రెండు రోజుల నుంచి మన్యంలో కురుస్తున్న వర్షాలకు వరి పనలు తడిచిపోతున్నాయి. జిల్లాలో సాధారణ విస్తీర్ణం 56 వేల హెక్టార్లు. 48 వేల హెక్టార్లలో నాట్లు వేశారు. గత ఆగస్టులో కురిసిన వర్షాలకు పంట దెబ్బతింది. ఆ తరువాత నుంచి వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో పైరు ఏపుగా ఎదిగింది. పసిడి వర్ణంలో కళకళలాడుతోంది. వారం రోజుల క్రితం వరకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో వరికోతలు చేపట్టారు. కోసిన పనలను పొలాల్లో ఆరబెట్టారు. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా అక్కడక్కడ కురుస్తున్న వర్షాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. పొలాల్లోని వరి పనలను సురక్షిత ప్రాంతాలకు తరలించి కుప్పలు పెడుతున్నారు.

పాడేరు డివిజన్‌లో..

జిల్లాలోని పాడేరు డివిజన్‌లోని మండలాల్లో బుధవారం వర్షం కురిసింది. జి.మాడుగులలో 62.8, చింతపల్లిలో 38, పెదబయలులో 22.4, గూడెంకొత్తవీధిలో 13.2, ముంచంగిపుట్టులో 12.4, పాడేరులో 1.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో కూడా సాయంత్రం వర్షం కురిసింది. పంట కోత సమయంలో కురుస్తున్న వర్షాలు గిరి రైతులను కలవరపరుస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో తగ్గుముఖం పట్టకపోతే తిండి గింజలు కూడా దొరకని పరిస్థితి ఉంటుందని వారు వాపోతున్నారు. వరి కోతలు పూర్తయ్యే వరకు కరుణించాలని వేడుకుంటున్నారు.

నూర్పిడి యంత్రాలకు డిమాండ్

మన్యంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం నూర్పిడి యంత్రాలకు డిమాండ్ పెరిగింది. మైదాన ప్రాంతాల నుంచి నూర్పిడి యంత్రాలను అద్దెకు తీసుకువస్తున్నారు. గంటకు రూ.వెయ్యి చొప్పున అద్దె చెల్లిస్తున్నామని గిరి రైతులు తెలిపారు. జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట ప్రాంతాల్లో నూర్పిడి పనుల్లో వారు నిమగ్నమయ్యారు.

రైతులు అప్రమత్తం కావాలి

తుపాను వల్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం కోసిన వరిపనలను పొలాల్లోంచి సురక్షిత ప్రాంతాలకు తరలించి పంటను కాపాడుకోవాలి. వర్షానికి తడిచిన వరి పనలను గట్లపైకి తరలించి వాటిపై ఉప్పు ద్రావణం పిచికారి చేయాలి. పంటను కోయని పొలాల్లో నీటిని నిల్వలేకుండా చూడాలి. నీరు పోయేలా మడులు ఏర్పాటుచేయాలి. అవకాశం ఉన్నంత వరకు వెంటనే పంట నూర్పిడి చేపట్టాలి.

– ఎస్‌బీఎస్ నందు,జిల్లా వ్యవసాయాధికారి

మంచు గుబులు

డుంబ్రిగుడ: వరి సాగు చేపట్టిన రైతుల్లో వర్షంతోపాటు మంచు గుబులు నెలకొంది. మండలంలోని గుంటసీమ, గుంటగన్నేలు, రంగిలిసింగి, కొల్లాపుట్టు, గసభ, పోతంగి, సొవ్వా, కితంలంగి, అరకు, అరమ పంచాయతీల్లోని గ్రామాల్లో సుమారు 3,404 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. ఆలస్యంగా నాట్లు వేసిన ప్రాంతాల్లో డిసెంబర్ నాటికి పక్వానికి వస్తుంది. సకాలంలో నాట్లు వేసిన ప్రాంతాల్లో పైరు కోతకు సిద్ధంగా ఉంది. ఈ పరిస్థితుల్లో కురుస్తున్న మంచు వల్ల వరి గింజ నానిపోయే పరిస్థితి ఉందని గిరి రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయశాఖ సూచనలు ఇవ్వాలని వారు కోరుతున్నారు.



డుంబ్రిగుడ మండలంలో మంచుకు తడిచిపోయిన వరి కంకులు

ఆంగ్లంలో అనర్గళంగా..

- ప్రతిభ కనబరుస్తున్న గిరి విద్యార్థిని దీపిక



తల్లిదండ్రులతో దీపిక

ముంచంగిపుట్టు: మారుమూల గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని దీపిక ఆంగ్లంలో ప్రావీణ్యం కనబరుస్తోంది. కుమడ పంచాయతీ చీపురుగొంది గ్రామానికి చెందిన కిల్లో బాలకృష్ణ, పుష్ప కుమార్తె అయిన ఆమె మండల పరిషత్ పాఠశాలల్లో మూడవ తరగతి చదువుతోంది. ఎంత కష్టమైన ఆంగ్ల పదాలను అయినా అనర్గలంలో చెబుతోంది. ఈమె ప్రతిభను గుర్తించిన పాఠశాల ఉపాధ్యాయుడు హనుమంతరావు ప్రోత్సహిస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో విజయవాడలో నిర్వహించిన ఇండియన్ బిగ్గెస్ట్ ఇంగ్లీష్ కాంపిటీషన్ ఫర్ రీజినల్ లీగ్ లాంగ్వేజ్ స్కూల్స్ వరల్డ్ ఛాంపియన్ పోటీల్లో పాల్గొన్న దీపిక ఆంగ్లంలో వివిధ ప్రశ్నలకు అనర్గళంగా సమాధానాలు చెప్పి మొదటి బహుమతి సాధించింది. ఏప్రిల్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆమె ఆరవ స్థానంలో నిలిచింది. ఎంత పెద్ద పదాన్ని అయినా తప్పులేకుండా చెప్పడం, రాయడంతోపాటు చదువుతోంది. వంద దేశాల పేర్లను చెబుతుంది. ఇంత చిన్న వయసులో జ్ఞాపిక శక్తితోపాటు, ఆంగ్లంలో పట్టు సాధించిన దీపక పలువురి ప్రశంసలు అందుకుంటోంది.

విలువిద్యలో గురితప్పని బాణం

- రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న గిరి విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మూర్తి, కోచ్ సూరిబాబు

అరకులోయ టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా జోగం పేటలో జరిగిన రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో అరకు క్రీడా పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. టెన్త్ చదువుతున్న ఎస్. జయ ప్రసాద్ (ఇండియన్ రౌండ్), డి. గౌతమ్ బుద్దదేవ్(రిజర్వ్ రౌండ్) అండర్ 17 విభాగం, 6వ తరగతి చదువుతున్న లలిత్ సాయితేజ్ (ఇండియన్ రౌండ్) అండర్ 14 విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. గుజరాత్ నడియాడ్ జంక్షన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి విలువిద్య పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ పోటీల్లో కూడా రాణించి పతకాలు సాధించాలని పాఠశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి, కోచ్ లకే సూరిబాబు ఆకాంక్షించారు.

గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన

- కలెక్టర్ దినేష్‌కుమార్
- హుకుంపేట మండలంలో పర్యటన

హుకుంపేట: మారుమూల గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని భీమవరం, అండిబ, బూర్జ, కొట్నాపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పర్యటించారు. దీనిలో భాగంగా భీమవరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. బాలింతలు, గర్భిణులకు మంచి పౌష్టికాహారం అందించాలని ఆయన సూచించారు. వీడీవీకే కేంద్రాన్ని పరిశీలించారు. దీనివల్ల పొందే లబ్ధిని గిరిజనుల నుంచి తెలుసుకున్నారు. కొండచీపుళ్ల సాగు చేసే గిరిజనులతో మాట్లాడారు. ఆదాయ వివరాలను తెలుసుకున్నారు. అనంతరం అండిబ, బూర్జ పంచాయతీల్లో పర్యటించారు. గిరిజనుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. అండిబ–దిగువ మోదాపుట్టు, బూర్జ– పటకదొడ, మజ్జివలస– కొండయ్యపాడు, గంగరాజుపుట్టు–మదనపురం రోడ్లను పరిశీలించారు. బీటీ రోడ్లు మంజూరు చేయాలని గిరిజనులు కోరారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. నక్కగొయ్యి గ్రామంలో పీవీటీజీ గిరిజనులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు.



నక్కగొయ్యిలో గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్



భీమవరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

బాలికల ఉన్నత పాఠశాల తనిఖీ

మండలంలోని పెదగరువు గిరిజన సంక్షేమ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ దినేష్‌కుమార్ తనిఖీ చేశారు. విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పాఠశాల పరిసర ప్రాంతాలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, ఈవోపీఆర్డీ అప్పలరాజు, ట్రైబల్ వెల్ఫేర్ డీఈ ధ్రువకుమార్, పీఆర్ ఏఈ సంజీవరావు,హౌసింగ్ ఏఈ ఈశ్వరి, సీడీపీవో బాలచంద్రమణి దేవి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన దిగుబడి సాధనకు సహకారం

రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా గిరిజన రైతులకు వ్యవసాయంలో మెరుగైన దిగుబడులు సాధించేలా సహాయ, సహకారాలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సూచించారు. బుధవారం ఆయన పందిరిమామిడి కేవీకేలో గిరిజన మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు చేపల పెంపకం చేపట్టి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కేవీకేలో మత్స్యవిభాగం శాస్త్రవేత్త కె.వీరాంజనేయులు మాట్లాడుతూ ఈ ఏడాది బొచ్చు, రాగండి, అమూర్‌కార్ప్ చేప పిల్లలను పంపిణీ చేసినట్లు తెలిపారు. వాటికి సరియైన పోషకాలు అందించగలిగితే ఆరునుంచి ఎనిమిది నెలల కాలంలో కిలో బరువు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే అధిపతి డా. కె.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



చేప పిల్లలను పంపిణీ చేస్తున్న పీవో సింహాచలం

కలప అక్రమ రవాణాపై నిఘా

రాజవొమ్మంగి అటవీక్షేత్రాధికారి ఉషారాణి

రాజవొమ్మంగి: కలప అక్రమ రవాణాపై నిఘా పెంచామని అటవీక్షేత్రాధికారి గుమ్మిడి ఉషారాణి తెలిపారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు.మారుజాతి, మామిడి, జీడిమామిడి కలపను తరలిస్తే చర్యలు తప్పవన్నారు. పొలాల్లోని చెట్లు నరికేందుకు రైతులు ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. రైతుల దరఖాస్తులు పరిశీలించిన తరువాత వాటిని కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. సొంత చెట్లు అయినప్పటికీ అనుమతి తప్పనిసరిగా పొందాలని ఆమె సూచించారు.

96వేల మొక్కలు ఉత్పత్తికి చర్యలు

ఎన్ఆర్‌జీఎస్ నిధులతో పాపంపేట వద్ద ఏర్పాటు చేయనున్న నర్సరీలో 96 వేల మొక్కలు ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంతో చర్యలు చేపట్టామని అటవీ క్షేత్రాధికారి గుమ్మిడి ఉషారాణి వెల్లడించారు. ఈ నర్సరీలో మారుజాతి, కరివేపాకు, జామ, కానుగ, నల్లమద్ది, పూలజాతి మొక్కలను పెంచి రైతులకు ఉచితంగా అందజేస్తామన్నారు. మండలంలోని ఉర్లాకులపాడు వద్ద గల సెంట్రల్ నర్సరీ నుంచి ఈ ఏడాది 35 వేల టేకు దుంపలను రైతులకు సరఫరా చేయాలని నిర్ణయించామన్నారు. వన్యప్రాణుల జోలికి వెళితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ బాబు

హౌసింగ్ పీడీ బాబు

చింతపల్లి: పీఎం జన్‌మన్ పథకంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వాటిని సకాలంలో పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ బాబు కోరారు. బుధవారం ఆయన మండలంలోని కొమ్మంగి పంచాయతీ కొలపరి గ్రామంలో పర్యటించారు. గృహ నిర్మాణాల లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. మండలానికి 2674 ఇళ్లు మంజూరుకాగా వీటిలో 1207 బేస్‌మెంట్ లెవెల్, 235 రూఫ్ లెవెల్, 23 శ్లాబ్ దశలో ఉన్నాయన్నారు. హౌసింగ్ ఏఈఈ రమణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజారావు పాల్గొన్నారు.



పరదేశిపుట్టు ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న హౌసింగ్ పీడీ బాబు

జి.మాడుగుల: కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ పీడీ బాబు అదేశించారు.బుధవారం ఆయన మండలంలోని కె.కోడాపల్లి పంచాయతీ పరదేశిపుట్టు ఆదివాసీ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. పీవీటీజీ గిరిజనుల ఇళ్లకు సంబంధించి నిధులు పుష్కలంగా ఉన్నాయని, త్వరిత గతిన నిర్మాణాలు చేపడితే బిల్లులు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. ఏఈ డి. ఈశ్వరరావు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు జెన్‌కో ఏడీఈగా దుర్గాశ్రీనివాసరావు

- బాధ్యతల స్వీకరణ



సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు క్యాంప్ ఏడీఈగా కె.దుర్గాశ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆ స్థానంలో పనిచేస్తున్న వెంకటమధును మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి అధికారులు బదిలీ చేశారు. విజయవాడ నార్లతాతారావు థర్మల్ పవర్ స్టేషన్‌లో ఏఈగా పనిచేస్తున్న కె.దుర్గాశ్రీనివాసరావును పదోన్నతిపై ఏడీగా జెన్‌కో ఉన్నతాధికారులు నియమించారు. ఆయనకు క్యాంపు సెక్షన్ ఏఈఈ సురేష్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

విస్తృతంగా తనిఖీలు



ఆర్టీసీ బస్సులో తనిఖీ చేస్తున్న పోలీసులు

గంగవరం : జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా ఎస్‌ఐ భూషణం ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులు, వాహనాలను తనిఖీ చేశారు. గంగవరం–అడ్డతీగల ప్రధాన రహదారికి ఇరువైపులా క్షుణ్ణంగా పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు : స్థానిక విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ పనుల నిమిత్తం గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఈఈ ఏవీఎస్ఎం అప్పారావు తెలిపారు. పాడేరు– జి.మాడుగుల నేషనల్ హైవే పనుల్లో భాగంగా జి.మాడుగుల మండలంలోని అన్ని గ్రామాలకు సరఫరా నిలిచిపోతుందన్నారు. కొయ్యూరు మండలం కాకరపాడు విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం కాకరపాడు, ఏవళ్లు, సింగవరం, మర్రివాడ, మాకవరం గ్రామాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. పాడేరు మండలం కిండంగి సబ్ స్టేషన్ పరిధిలోని తుంపాడ, డల్లాపల్లి, దిగు మోదాపుట్టు, రాములపుట్టు, పెదబయలు సబ్ స్టేషన్ పరిధిలోని రోగులపుట్టు, చట్రాయిపుట్టు, కుమ్మరిపుట్టు గ్రామాలకు సరఫరా నిలిచిపోతుందన్నారు. వీటితోపాటు హుకుంపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో సరఫరాక అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

- కూలి పనులు దొరక్క నిరాశ
- మృతుడు కాకినాడ జిల్లా వాసి

పాడేరు : పొట్ట కూటి కోసం వలస వచ్చిన ఓ వ్యక్తి కూలి పనులు దొరక్కపోవడంతో నిరాశకు గురయ్యాడు. జీవితంపై విరక్తితో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక ఎస్‌ఐ సూర్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా అన్నవరం సమీపంలోని పారుపాక గ్రామానికి చెందిన సారిపల్లి గంగరాజు (52) అనే వ్యక్తి నాలుగు నెలల క్రితం కూలి పనుల నిమిత్తం పాడేరు వచ్చాడు. అప్పటినుంచి సక్రమంగా కూలి పనులు దొరక్కపోవడంతో నిరాశకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో కొత్త పాడేరు వద్ద వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం బావి వద్దకు దుస్తులు ఉతికేందుకు వెళ్లిన మహిళలు మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారం మేరకు గంగరాజుగా పోలీసులు గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.



గంగరాజు మృతదేహం

బరిలో నిలిస్తే పతకమే

- వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్న మధుచందన





వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌లో మధుచందన సాధించిన పతకాలు

చింతూరు: స్థానిక కేజీబీవీ విద్యార్థిని గుత్తుల మధుచందన వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాణిస్తోంది. చింతూరుకు చెందిన గుత్తుల శ్రీనివాస్, పూర్ణిమ కుమార్తె అయిన ఈమె 2017 నుంచి స్థానిక వీరభద్ర పవర్ జిమ్ కోచ్ గోలి గంగాధర్ సారథ్యంలో తర్ఫీదు పొందుతోంది. జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ఇప్పటివరకు 37 పతకాలు సాధించింది. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ స్థాయిలో ప్లస్ 87 కేటగిరీలో ప్రతిభను చాటుకుంది. స్కూల్ గేమ్స్ అండర్–19 విభాగంలో జాతీయ స్థాయిలో బ్రాంజ్ మెడల్‌తో పాటు రాష్ట్రస్థాయిలో 18 గోల్డ్, 11 సిల్వర్, 7 బ్రాంజ్ పతకాలను సాధించింది.